కనకారావు ఆమె వేపు తిరిగి "మీరిచ్చిన డబ్బులో రెండు రూపాయలు పెట్టి డ్రింకు తాగుతాడట. మిగతావి ఇలాగే అడుక్కుంటాడు కాబోలు, మ్చ్! నా దగ్గిర కూడా ఏమీ డబ్బులు లేవు. ఉంటే నేనూ ఉడతా భక్తి సాయంచేసి వుండేవాణ్ని."

రాధ మరో రెండ్రూపాయలు తీసి ఇస్తూ "పాపం ఆ డబ్బు అలా వుంచుకొమ్మనండి. ఇదో దీనితో డ్రింకు తాగమనండి" అంది.

"హింత సహాయో మిసినిషి నామ్ నేమ్ సప్స" అన్నాడు మురళి.

"ఇంత సాయం చేసిన మీ పేరేమిటో తెచుసుకోవచ్చా అని అడుగుతున్నాడు మేడమ్! మీకభ్యంతరం లేకపోతే చెప్పండి. వీళ్ళకి ఎడారి దేవత అని చాలా పవర్ ఫుల్ దేవత వుంటుంది. అక్కడ మీపేర్న అర్చన చేయిస్తే శుభం కలుగుతుంది."

"రాధ" అందా పెద్ద బొట్టు, కంచి పట్టుచీరె.

వాళ్ళకి డబ్బులిచ్చి బయల్దేరి నాలుగు అడుగులు వేసేక ఏదో అనుమానం వచ్చి వెనుదిరిగి చూసింది రాధ. అప్పటికే మిత్రులిద్దరూ సిగరెట్ షాప్ దగ్గిరకి చేరి పగలబడి నవ్వుకుంటున్నారు.

వళ్ళు మండిపోయింది రాధకి. రోషంగా షాప్ దగ్గిరకు నడిచింది.

అప్పుడే మురళి "కూల్‌డ్రింక్‌లు రెండు కొట్టు గురూ! పాపం, అమ్మాయిచ్చిన డబ్బులు" అంటున్నాడు.

"అవి తాగి థార్ ఎడారిలోకి వెళ్ళాలి" అంటున్నాడు కనకారావు.

"మిష్టర్ మీకు బుద్ధిలేదూ" అని వెనుక నుంచి వినపడ్డాయి మాటలు. ఇద్దరూ ఉలిక్కిపడి చూశారు. ముందు తేరుకున్నది మురళి.

"ఇహిహి. జస్ట్ ఫన్ సేక్! ఎలా వుందండీ?" అన్నాడు.

"ఫన్నా .... నా మొహంలా వుంది."

"అఫ్‌కోర్స్. మీకు కోపం రావటం సహజం అనుకోండి! కానీ మీరిది ఈజీగా తీసుకోవాలి. కారణం...."

"మీకు సిగ్గు వేయటంలేదూ!"

"సిగ్గా, ఎందుకండీ?"

"అలాటి వెధవ పనిచేసి పైగా నవ్వుకోవటానికి!"

"మీరే సిగ్గుపడాలి మాడమ్--పదహారణాల ఆంధ్రా అబ్బాయి, కాస్త క్రాఫు చెదిర్చి, బాష మార్చగానే థార్ ఎడారి వాసో, ఎస్కిమోనో అనుకోటానికి--" అన్నాడు మురళి.

"షటప్" అనేసి విసవిసా అక్కణ్నుంచి వెళ్ళిపోయింది.

****

"అది సార్ జరిగింది" అంటూ పూర్తి చేశాడు మురళి. అంతా చెప్పి "అదే సార్ ఆ

కనపడేది. నడి వీధిలో, మధ్యాహ్నం ఎండలో, అడగ్గానే అలా పర్సు తెరిచి ఏడు రూపాయలు ఇచ్చేసే జాలి గుండె , అంత అమాయకత్వమూ ఎవరికి వుంటాయి సార్? అసలామెనిచూస్తేనే తులసి చెట్టు గుర్తొస్తుంది.”

రామలింగం నవ్వి, “అదే నాయినా ప్రేమంటే” అన్నాడు.

“కానీ....”

“నువ్వు చెప్పబోయేది అర్థ మైంది. ఇలా మోసం చేసిన కుర్రవాణ్ణి ఎలా ప్రేమిస్తుంది అని కదూ నీ సంశయం! అలాటిదేమీ పెట్టుకోకు. ఇంత అద్భుతంగా నాటకం ఆడి పందెంగెల్చినట్టు ఆ అమ్మాయికి తెలిసిందంటే నువ్వు హీరోవి అయిపోతావు. ఒకసారి నా కాలేజి లైఫ్‌లో ఏం జరిగిందంటే....”

“మీరాగండి సార్!” విసుగ్గా అన్నాడు విన్సెంటు. “కథ అక్కడితో ఆగలేదు.

ఇది జరిగిన కొన్నాళ్ళకి మన మురళిలా వున్న వాడెవడో నడిబజార్లో ఆ అమ్మాయిని అందరూ చూస్తూ వుండగా దగ్గరకి లాక్కొని ముద్దు పెట్టుకున్నాడు. ఆ మరుసటి రోజు ఆ అమ్మాయి, వాడే అనుకుని మురళి చెంప పగలగొట్టింది.”

రామలింగం నమ్మలేనట్టు చూశాడు.

“అవును సార్! ఈ అదృష్టరేఖ చూడండి.”

రామలింగం మనసారా నవ్వుకున్నాడు. ఇన్నాళ్ళకి తన కసి నెరవేరబోతూంది. ప్రేమ విషయం వచ్చేసరికి ఈ అల్లరి కోతులు మూడూ తన సలహా అడగటానికి రావటమే వాళ్ళు చేసిన మొదటి తప్పు!

ఒకే బాణానికి రెండు పక్షులు!

ఆ ఉమెన్స్ కాలేజి హాస్టలు వార్డెనుకీ తనకీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గున మండుతుంది. ఆవిడ హయాంలో అమ్మాయిలు ఎలా పాడైపోతున్నారో చెప్పటానికి ఇదో మంచి ఉదాహరణ! ఒక హాస్టల్ అమ్మాయి నడిరోడ్లో కాలేజి అబ్బాయికి డ్రింక్ ఇప్పించింది! పైగా నడిరోడ్డుమీద విచ్చలవిడిగా ముద్దులిచ్చేస్తూంది. ఈ దెబ్బతో ఆ వార్డెను పని గోవిందా! ఇహపోతే ఈ కుర్రోళ్ళు! ఈ దార్లో వీళ్ళని ఇంకొంచం ముందుకి పంపి అక్కడ దెబ్బకొట్టాలి. గుక్క తిప్పుకోనివ్వకుండా దెబ్బ కొట్టాలి! వీలైతే టి.సి. ఇప్పించి ....

“ఏమిటి సార్ ఆలోచిస్తున్నారు?”

“ఏమీలేదోయ్ .... అదే! నిన్ను ఆ అమ్మాయి ప్రేమించేలా చేయటం ఎలా అని ! అన్నట్టు నువ్వు ఒక ప్రేమలేఖ ఎందుకు వ్రాయకూడదోయ్?”

“అబ్బే అది చాలా ఓల్డ్ టెక్నిక్ సార్!”

“ప్రేమకు ఓల్డు -- న్యూ అని రెండు రకాలు లేవోయ్. అందంగా వ్రాసి, నాకు చూపించు. తరువాత ఆమెకి అందించు ” అంటూ లేచాడు-- “ముందు ఈ పని చెయ్యి. తరువాత రెండో స్టెప్పు నేను చెప్తాను” అని వెళ్ళిపోయాడు.

అతడికి ఎప్పుడెప్పుడు లేడీస్ హాస్టల్ వార్డెన్‌ని పట్టుకుని దులిపేద్దామా అని అంది.

రామలింగం వెళ్ళినవైపే ఆశ్చర్యంగా చూస్తూ, “ఇదేమిటి గురూ! మనవాడికున్నట్టుండి ఇంత మంచి బుద్ధి వచ్చింది?” అన్నాడు కనకారావు.

మురళి మాట్లాడలేదు. రాధకున్న అపార్థం పోగొట్టి ఎలా మంచి చేసుకోవటమా అన్న ఆలోచనలో వున్నాడు.

******

“బుద్ధుండాలి”

---అన్న మాటలకు లక్ష్మీకాంతం తలెత్తి చూసింది.

రామలింగం ఎదురు కుర్చీలో కూర్చున్నాడు. అతడి మొహంలో విజయగర్వం తొణికిసలాడుతోంది.

“మిస్టర్ రామలింగం! నేనే మిమ్మల్ని కలుసుకుందామనుకుంటున్నాను. ఇంతలో మీరే వస్తున్నాను అని కబురంపించారు.”

“ఎందుకో కల్సుకోవాలనుకోవటం?” ఓరగా చూస్తూ అడిగాడు.

“ఒకమాట చెప్పడానికి.”

“ఏ మాట?”

“బుద్ధుండాలి.”

“వ్వాట్?”

“బుద్ధుండాలి. ఆ మాట చెప్పడానికే.”

రామలింగం గతుక్కుమని, అంతలోనే సర్దుకుని, “మీ అమ్మాయిలు ఎంత పెట్రేగిపోతున్నారో తెలియజెప్పడానికే వచ్చాను. మీ హాస్టల్లో ఒకమ్మాయి బరితెగించి బోయ్‌ఫ్రెండ్స్‌కు నడివీధుల్లో డ్రింక్‌లు ఇప్పిస్తున్నదట. మీ అమ్మాయిలు భారత సంస్కృతి, మర్యాద మరిచి పోయి అసభ్యంగా వస్త్రధారణ చేసుకొని తిరగటంతో అబ్బాయిలకు మతి పోతోందని నాకు కంప్లెయింటు చేశారు. అలా పోవటంలో తప్పులేదు! ఒక కుర్రవాడైతే మతి భ్రమించి నడివీధిలో ముద్దు పెట్టేసుకున్నాడట కూడా! దీనికంతా కారణంఎవరు? అమ్మాయిలు కూడా కాదు మిసెస్ లక్ష్మీకాంతం! దీనికి కారణం మీరు. లేడీస్ హాస్టల్ వార్డెన్ అంటే ఎవరు? తల్లిలాటిది. ఉదాహరణకి నన్నే.... నన్నే తీసుకోండి. నేను మా పిల్లకాయల్నందర్నీ తండ్రిలా చూసుకుంటాను! తల్లీతండ్రుల సంస్కారాన్ని బట్టే పిల్లలు పెరుగుతారనడానికి మీ హాస్టలే ఒక ఉదాహరణ. ఇప్పటినుంచన్నా మీ పిల్లల్ని ఒక కంట కనిపెట్టి వుండండి. కాలేజీకే వెళుతున్నారో -- ఆ పేరు చెప్పి కూల్‌డ్రింకు లిప్పిస్తున్నారో....”

లక్ష్మీకాంతం ముక్కుపుటాలు ఎర్రబడ్డాయి. “మిస్టర్!” అంది.

రామలింగం వినిపించుకోలేదు. ఎన్నాళ్ళకో దొరికింది ఛాన్సు అన్నట్టు పెట్రేగిపోయాడు.

“అసలు సంస్కారం అనేది మన రక్తంలో వుండాలి మొదట. అప్పుడు మన పిల్లలకు వస్తుంది.

మనమీద ఎంతో పవిత్రమైన బాధ్యత పెట్టింది కాలేజి మానేజిమెంటు. పిల్లల్ని ఒక కంట కనిపెట్టి వుండాలి. స్వంత తల్లి, తండ్రికన్నా ఎక్కువగా వాళ్ళ నడవడిక పరిశీలిస్తూ వుండాలి."

"మిస్టర్ రామలింగం!" లక్ష్మీకాంతం కుర్చీలోంచి చివాలున నిలబడుతూ అంది -- "మీరేం మాట్లాడుతున్నారో నాకు అర్థం కావటంలేదు. ఫర్ యువర్ ఇన్ఫర్మేషన్ మీరు చెప్పిన ఆ కూల్‌డ్రింకులమ్మాయి, నడివీధిలో రౌడీ ముద్దు పెట్టుకున్న అమ్మాయీ ఒకరే" అంది.

"నాకు తెలుసు! ఒకరయితేనేం? కుండెడు పాలలో ఒక చుక్కవిషం చాలు. నిండు చంద్రుడిలో ఒక చిన్న మచ్చ చాలు."

"ఆ అమ్మాయి మా హాస్టలమ్మాయి కాదు."

రామలింగానికి బ్రేకు పడ్డట్లు అయింది.

"అవును. ఆ అమ్మాయి అనురాధ అని గుడివీధిలో వుంటుంది"

రామలింగం జుట్టులోంచి చెమట కారటం మొదలు పెట్టింది. "గుడివీధా?" అన్నాడు.

"అవును. అక్కణ్నుంచి కాలేజీకొస్తుంటేనే ఆ మురళి అనే కుర్రాడు ముద్దు పెట్టుకున్నాట్ట."

"చచ్చాన్రో దేముడో" అని అరిచాడు. నెత్తిన చేతులు పెట్టుకుంటూ. "ఆ అనూరాధ నా మేనకోడలే--"

******

ఆ మరుసటి రోజు, అంటే సరిగ్గా ఇరవై నాలుగ్గంటల తరువాత మురళీ తన గాంగ్‌తో హడావుడిగా రామలింగం రూమ్‌లోకి జొరబడ్డాడు.

"నమస్కారం గురూగారూ! మీరు చెప్పినట్టు రాధకు అద్భుతమయిన ప్రేమలేఖ రాసేశాను రాత్రంతా కూర్చుని! చూడండి! " అంటూ ప్రేమలేఖ రామలింగం ముందుంచాడు.

రామలింగం అతికష్టంమీద తన మొహంలో ఫీలింగ్స్‌ని పైకి కనబడకుండా దాచుకున్నాడు.

"చదవండి గురూజీ! అలా చూస్తారేమిటి? ఆ రోజుల్లో మీరు ఇలాంటి ప్రేమలేఖలు దంచేశానన్నారుగా"

ఇక తప్పదన్నట్టు రామలింగం చదవటం ప్రారంభించాడు.

"నా హృదయ కుసుమ రసస్వాదిత శ్వేత సుసుర గంగభీ?" అని చదివి మనసులోనే కారాలు నూరుతూ.

"ఏమిటిది? ఇలాంటి పదాలు నేనింతకు ముందెక్కడా చూళ్ళేదూ చదవలేదే? " అన్నాడు గంభీరంగా.

"అదే సార్ మన గొప్పతనం! అందుకే ఓ రాత్రంతా పట్టింది ఇది రాయటానికి." గొప్పగా అన్నాడు మురళి.

తిరిగి ఉత్తరం మీదకు దృష్టి సారించాడు రామలింగం.